# 22

# “ఒక మనుష్యుని ద్వారా”

## (5:12-21 పరిచయం)

మానవాళిలోనికి ఆదాము ఏ సమస్యలను ప్రవేశపెట్టినా – యింకా ఏమైనా – వాటన్నిటిని క్రీస్తువారు పరిష్కరించుటకు తగిన చర్య తీసుకొన్నట్టు రోమా 5:12–21 అభయమిస్తుంది. J. D. Thomas దాన్ని యిలా అన్నాడు: “ఏది మనం ఆదామునందు పోగొట్టుకున్నామో దాన్ని మనం క్రీస్తులో పొందాం ... క్రీస్తునందు మనం సంపాదించు కొన్నది ఆదామునందు పోగొట్టుకున్న దానికంటె బహుగా మించినదైయుంది.”[1] రోమా 5 చివరి భాగం యొక్క ప్రాథమిక సందేశం అది.

దీనిని అక్కడ విడిచిపెట్టి అధ్యాయం 6కు వెళ్లాలనే శోధన వస్తుంది, కాని కనీసం మూడు కారణాలనుబట్టి రోమా 5:12–21ని దాటి వెళ్లలేం. మొదటిది, రోమా పత్రిక మూల వాక్యాన్ని మనకు చేతనైనంతమట్టుకు డీల్ చేయాలి. రెండవది, ఇందులోని కొన్ని ఆలోచనలు, పదాలు తరువాత విస్తరింపజేయబడ్డాయి. గనుక పూర్వ గాథగా ఈ భాగాన్ని గూర్చి కొంత గ్రహింపు మనకు అవసరమైయుంది. మూడవది, పరిశుద్ధాత్మ ఈ వచనాలలో ప్రాముఖ్యమైన సత్యాలను చేర్చాడు.

రోమా 5:12–21ని అలక్ష్యంచేసి దేనికి నేను తరువాత అధ్యాయానికి వెళ్లాలి? ఎందుకంటే, ఈ భాగం కష్టతరమైనది. “ఉత్తరంలోనే అతి కష్టతరమైన భాగమని” Moses E. Lard దీన్ని పిలిచాడు.[2] “బైబిలు అంతటిలోనే రోమా 5:12–21 అత్యంత కష్టమైన లేఖన భాగమని” కొందరు భావించినట్టు Richard Rogers అన్నాడు.[3] “ప్రతి పదం – విషయాన్ని విడదీసే ప్రతి గుర్తు – తీవ్ర వివాదానికి గురియైయ్యింది” అని Douglas J. Moo 12వ వచనాన్ని కామెంట్ చేశాడు.[4]

పలు కారణాలను బట్టి, రోమా 5:12–21 వ్యాఖ్యానకర్తలకు సవాలు విసిరింది. అందుకు ఒక కారణం పౌలు రచనా విధానం. అప్పుడప్పుడు, అతడు వాక్యాన్ని పూర్తి చేయడు (వచనం 12 అంతం చూడు). అతడు ఒక తలంపునుండి మరియొక దానికి గంతులు వేస్తుంటాడు. 12వ వచనంలో ఆరంభమైన వాక్యం 18 వచనంవరకు ముగియలేదు. అప్పుడతడు క్రియా వాచకాలను మిగతా కీలక పదాలను విడిచిపెట్టాడు (ఉదాహరణకు, 16వ వచనంలో తర్జుమాదారులు చేర్చిన పదాలను గమనించు). పైగా, ఈ లేఖన భాగంలో పౌలు ఉద్దేశం ఆదాముకు, క్రీస్తుకు మధ్య సమాంతరాలను గీస్తున్నాడు. కొన్నిసార్లు అవి ఎలా పోలి ఉన్నాయి, మరికొన్నిసార్లు అవి ఎలా వ్యత్యాసంగా ఉన్నాయో అతడు సూచించాడు; మరికొన్ని సార్లయితే, అసలు పోలికయే లేదు.

ఈ భాగం బాగా సంక్షిప్తం చేయబడినట్టు సాధారణంగా అంగీకరించబడుతుంది.[5]

"పౌలు రచనలన్నిటిలో యిది బహుగా సంక్షిప్తం చేయబడినదని" ఒక రచయిత అభిప్రాయపడ్డాడు.[6] (నేను 5:12-21 చదువుచుండగా, చాల రోజుల క్రిందట సంక్షిప్త ప్రసంగపు నోట్సు జ్ఞప్తి చేయబడింది. "అలా అంటే అర్థమేమో ఆలోచించు ... ఆ పాయింటులో నేనేమి చెప్పానో ఆశ్చర్యపోయాను. ... నేను ఉపయోగించిన కుక్క ఉదాహరణ ఏమి?") పౌలు వాదం ఎంతగా కుదించబడిందంటే, తన ఆలోచనలను గ్రహించడానికి మూల వాక్యాన్ని విస్తరింపజేయడం అవసరమైయ్యింది. ఏమి మాటలు అవసరమౌతాయో మనం నిశ్చయించలేము అనేది సమస్యగా ఉంది. తత్ఫలితంగా, "బైబిలులోని యితర భాగాలనుండి పొందిన ఒప్పుదలలతో" "ఖాళీలను పూరించే" పరిస్థితి ఏర్పడింది.[7]

పౌలు రచనా విధానము, అతని మాటలను సంపూర్తి చేయడానికి చేర్చే పదాలు మూల వాక్యం మీద అనంగీకారానికి దారి తీశాయి. నమ్మకమైనవారును సామర్థ్యంగల ఉపదేశకులని నేను భావించేవారు సహితం (తీతు 1:13), ఈ క్రింది ప్రశ్నల వంటివాటితో ఏకీభవించరు. 12వ వచనంలోని "మరణం" భౌతిక మరణమా, ఆత్మ సంబంధమైన మరణమా, లేక ఈ రెండింటికి సంబంధించిన కలయికా? "అందరు పాపము" చేసినట్టు 12వ వచనం సూచించేది 3:23లో ఉన్నట్టు వ్యక్తిగతమైన పాపమా లేక ఆ మాట యింకేదైనా అర్థమిస్తాయా? రోమా పత్రిక యొక్క ఆరంభ పాఠకులకు గౌరవపదమైన రచయితల మధ్య భేదాభిప్రాయాలు నిరుత్సాహపరచేవిగా ఉంటాయి.

చివరిగా, 5:12-21ని వ్యాఖ్యానించడం మానవ కల్పిత సిద్ధాంతాలను ఉపదేశించే వారికి సాధకమయ్యింది. "బైబిలు మొత్తంలో ఈ లేఖన భాగం బహుగా దుర్వినియోగం చేయబడినదైనట్టు" అభిప్రాయపడ్డాడు.[8] అందువలన ఈ లేఖన భాగం ఏమి చెప్పుతుందో చెప్పక ముందు అది ఏమి చెప్పడం లేదో నొక్కి చెప్పడం అవసరమై ఉంటుంది.

రోమా పత్రికలో గుండ వెళ్లే మన ప్రయాణానికి రోడ్డు గురుతు నాటబడియుంటే, "కష్టతరమైన పరిస్థితులు! నీ సొంత రిస్కుతో ముందుకు సాగు!" అని పెట్టబడుతుంది. ఈ భాగం గుండా మన పోకడ అంత సులభమేమీ కాదు. ఏదియెలాగున్నా, ఈ లేఖన భాగం మీద మూడు పాఠాలు ముగించేసరికి నీకు కొంత అంతర్ దృష్టి కలిగి ఈ విహార యాత్ర కొంత ప్రయోజనకరమైనట్టు నీవు తలంచుతావని నిరీక్షిస్తున్నా.

ఈ పాఠం పునాదివేస్తుంది. తరువాత పాఠంలో మూల వాక్యాన్ని పఠించుదాం.

## ఈ లేఖన భాగం ఏమి బోధించడం లేదు

అది ఏమి ఉపదేశిస్తుందో అనే దానికంటే ఏమి ఉపదేశించడం లేదో రోమా 5:12-21ని గూర్చి ఎక్కువ నిశ్చయంగా తెలిసికోవచ్చు. ఆలాటి ఉద్దేశాన్ని కొందరు అపహసిస్తారనుకో. "అది ఏమి బోధిస్తుందో నిశ్చయంగా తెలియకుంటే అది ఏది నిశ్చయంగా బోధించడం లేదో ఎలా తెలుసు?" అని వారు అడుగుతారు. ఇది ఎలా సాధ్యమో ఉదహరించనిమ్ము. ఇద్దరు పురుషులు మాట్లాడుకొంటూ ఉండగా ఒక ప్రక్క గుండా ఒక స్త్రీ నడచిపోతుంది. "ఆ స్త్రీ ఎవరు? ఆమె నీ భార్యయా?" అని ఒక పురుషుడు మరొకనితో అన్నాడు. దానికి రెండవవాడు యిలా బదులిచ్చాడు, "ఆమె ఎవరో నాకు తెలియదు, కాని ఎవరు కాదో నేను నీకు చెప్పగలను. ఆమె నా భార్య కాదు." 5:12-

21లోని ప్రతి వివరణ నాకు *తెలియక* పోవచ్చు, కాని అది కొన్ని సిద్ధాంతాలను ఉపదేశించదని నాకు నిశ్చయంగా తెలుసు.

**ఆదాము పాప దోషాన్ని మనం స్వతంత్రించుకుంటామని అది బోధించ లేదు**

"క్రైస్తవులని" తమ్మును తాము పిలుచుకునే అనేకుల మధ్య, మనం ఆదాము పాప దోషాన్ని ఏదో విధంగా స్వతంత్రించుకుంటామనే విస్తరించిన విశ్వాసముంది. మూడవ శతాబ్దంలో, పౌలు వెడలిపోయిన రమారమి రెండువందల సంవత్సరాల తరువాత, "క్రొత్తగా జన్మించిన శిశువులు పాపములేనివారు కాదని" Origen అనే అలెగ్జాండ్రియన్ దైవతత్వవేత్త అన్నాడు.[9] నాల్గవ శతాబ్దంలో, ఆగస్తీన్ ఆ భావాన్ని విస్తరింపజేసి, వ్యాపింపజేశాడు. కథోలిక్కులు దానిని "the doctrine of original sin" ("జన్మ పాప సిద్ధాంతం") అని పిలిచారు. తరువాత ఎక్కువమంది ప్రొటెస్టెంటువారు ఆ భావాన్ని అవలంభించారు. "వారసత్వంగా చెడిపోయిన నీతి," లేక "పూర్ణంగా వారసత్వంగా చెడిపోయిన నీతి" అనే పదాలను వాడసాగారు. "పిల్లల చెడిపోయిన నీతిని" గూర్చి మాట్లాడునప్పుడు ఆదామునుండి వారసత్వంగా దానిని పొందారు అని విశ్వసించి మాట్లాడుతారు. ఇది ఆదామునుండి సంక్రమించిందని నమ్ముతారు. ఆదాము "చెడిపోయి, భ్రష్టుచేసి, అతి దుర్మార్గమై, మన స్వభావాన్నే నాశనం చేసాడు"[10] అని John Calvin అభిప్రాయపడ్డాడు.

"Calvinకు సంబంధించిన థియోలజీకి" "పూర్ణమైన వారసత్వపు అతి దుర్మార్గత" పునాది సూత్రంగా అయినట్టు చెప్పబడింది. జనులు ఎలా రక్షింపబడ్డారో అనే కథోలిక్ భావనకు "పూర్ణమైన వారసత్వపు అతి దుర్మార్గత" జోడించబడిన విధానం ఈ క్రింద యివ్వబడింది:

- జనులు ఆదాము పాపపు కళంకముతో జన్మించారు; గనుక రక్షింపబడడానికి వారు ఏమియు చేయలేని స్థితిలో నిలిచారు ("పూర్ణమైన వారసత్వపు దుర్మార్గత").
- వారిని మరల జన్మింపజేయడానికిని, రక్షించడానికిని జనుల మీదికి పరిశుద్ధాత్మను దేవుడు పంపాలని కాల్వినిష్టులు ఎదురు చూస్తారు ("పరిశుద్ధాత్మ నేరుగా పని చేయడం").
- రక్షింపబడడానికి జనులు ఏమియు చేయలేరని నమ్మే కాల్వినిష్టులు నశించిపోడానికి కూడ జనులు ఏమియు చేయలేరని అంటారు ("భ్రష్టత్వపు అసాధ్యత").

"జన్మ పాపము" అనే సిద్ధాంతము యొక్క ఫలితం ఏమంటే, చనిపోయిన శిశువులను గూర్చి కథోలిక్కులు ఆందోళన చెందనారంభించారు – శిశువులు ఆదాము పాపముచేత కలుషితం చెందినట్టు వారు నమ్మారు. "జన్మ పాపాన్ని" ఎదుర్కొనడానికి వారు శిశువులకు

“బాప్తిస్మమియ్యసాగారు.” బాప్తిస్మం పొందని పిల్లల సమస్య యింకను నిలిచేయుంది, గనుక “బాప్తిస్మం పొందక” మరణించిన శిశువులకొరకు వారు తరువాత లోకాన్ని కల్పించారు. ఆ గమ్యాన్ని వారు “Limbo”[11] అని పిలిచారు. అబద్ధ బోధలు ఎలా విస్తరిస్తాయో యిది ఒక ఉదాహరణయై ఉంది.

తిరిగి మనం “జన్మ పాప సిద్ధాంతం నొద్దకే” వెళ్లుదాం. ఆలాటి ఉద్దేశానికి జనులు ఎలా వచ్చి చేరుకున్నారు? ఈ సిద్ధాంతాన్ని అనుసరించేవారు పాపము యొక్క స్థిరమైన ప్రభావాన్ని నొక్కి చెప్పుతారు (నిర్గమకాండము 20:5 లాంటివి). లేదా మానవ పాప భూయిష్టతను ప్రత్యేకించి చూపడానికి ఉపయోగించబడిన అతిశయోక్తి లేఖనాలను వారు ఉపయోగిస్తారు (కీర్తన 51:5[12] లాంటివి). అయినా రోమా 5:12–21 వారి రుజువుకు ప్రాథమిక మూల వాక్యమైయుంది. “జన్మ పాప సిద్ధాంతానికి 12 వచనం ఆధారమైన లేఖన భాగమైయున్నట్టు” James R. Edwards రాశాడు. [13]

ముందుగానే సూచించినట్టు, ఈ సిద్ధాంతం ఏదో యొక రూపంలో క్రైస్తవ ప్రపంచంలోని సార్వత్రిక మూఢ సిద్ధాంతమైయుంది. ఇది రోమా 5లో చర్చించబడలేదని ధైర్యంగా చెప్పగలను. పాపాన్ని లోతుగా చర్చించడం ఈ లేఖన భాగంలో పౌలు యొక్క ఉద్దేశం కాదని మొదటిగా అంటాను. పౌలుకు ఆలాటి ఉద్దేశం లేదని అనేకమంది వ్యాఖ్యానకర్తలు ఒప్పుకుంటారు.

- “దాని దృష్టికి కేంద్రంగా ‘జన్మ పాపము’ రోమా 5:12–21లో లేదు” (Douglas J. Moo).[14]
- “దైవతత్వ శాస్త్రపు దృష్టినుండి వచనం 12 పాపపు సమస్యను చర్చించదు [పౌలు] ఉద్దేశము, యిక్కడ జన్మ పాప సిద్ధాంతాన్ని పెంపొందింపజేయడం కాదు” (James R. Edwards).[15]
- “చెడిపోయిన స్వభావాన్ని గూర్చి గాని లేక పాపపు తత్వాలను గూర్చిగాని పౌలు యిక్కడ ఏమియు చెప్పలేదు; ఆలాటి భావాలు మూల వాక్యంలోనికి చొప్పించబడ్డాయి” (Leon Morris).[16]

పైగా, 12నుండి 21వ వచనం వరకు “వారసత్వంగా పొందిన దుర్మార్గత” అనే సిద్ధాంతాన్ని ప్రకటిస్తుందనే క్లెయిమ్‌ను నేను నిరాకరిస్తున్నాను ఎందుకంటే ఆలాటి తీర్మానం బైబిలు వ్యాఖ్యానము యొక్క ప్రాథమిక సూత్రాన్ని అతిక్రమిస్తుంది: “వేరొక చోట స్పష్టంగానున్న లేఖన భాగాన్ని ఖండించునట్టు స్పష్టంగా లేని లేఖన భాగాన్ని వ్యాఖ్యానించకు.” ఈ వచనాలు స్పష్టంగా లేవని ఎంతో కొంతవరకు ప్రతి ఒక్కరు అంగీకరిస్తారు. అది వాస్తవమైనందున, ఈ క్రిందనున్న స్పష్టమైన బైబిలు ఉపదేశాలను ఖండించకుండునట్టు, ఈ లేఖన భాగాన్ని వ్యాఖ్యానించాలి:

- శిశువులు పవిత్రంగాను, పరిశుద్ధంగాను జన్మించారు. వారు ఆదాము పాపముచేత కలుషితం కాలేదు (లేక) పాడు కాలేదు (మత్తయి 18:3; 19:14 చూడు).

- ప్రతి ఒక్కడు తన పాప దోషానికి తానే బాధ్యుడు (ఎఫెసీయులకు 2:1; కొలొస్సయులకు 2:13), తన తండ్రి పాపానికో లేక ఆదాము పాపానికో బాధ్యుడు కాడు (యెహెజ్కేలు 18:20).

మనం జీవించే లోకంలో ఆదాము పాపము మహా విపత్కరమైన ప్రభావాన్ని తేలేదని నేను చెప్పుతున్నానా? తప్పక లేదు. ఆదాము పాప దోషాన్ని మనం స్వతంత్రించు కొనకపోయినా, అతని పాపము యొక్క దూరంగా చేరు *ఫలితాలను* మనం స్వతంత్రించు కోలేదని కాదు (నొక్కి చెప్పింది నాది). 17వ వచనంలో, "ఒక మనుష్యుని పాప *ఫలితంగా* మరణము ప్రతి ఒక్కని మీద ఏలుబడి చేసింది" అని ఉంది (JB; నొక్కి చెప్పింది నాది). "దోషము" మరియు "ఫలితాలు" అనేవాటికి మధ్యగల వ్యత్యాసమేమి? నా తండ్రి హత్య విషయమైన దోషియైనట్టయితే, ఆయన దోషము నా మీదికి రాదు. ఆ నేరాన్ని బట్టి నేను తీర్పు తీర్చబడను. అయితే ఆయన చర్యనుబట్టి నేను అనేక ఫలితాలను ఎదుర్కోవలసి వస్తుంది – ఉదాహరణకు, హృదయ వేదన, బాధ, అవమానములాంటివి. మరల అంటున్నా, మనం ఆదాము దోషాన్ని స్వతంత్రించుకోము, అయినా అనుదినము అతని చర్య యొక్క ఫలితాలను అనుభవిస్తాం.

ఏ ఫలితాలు? ఒక మనుష్యుని ద్వారా పాపము లోకములోనికి ప్రవేశించిందని వచనం 12 అంటుంది. ఏదెను తోటలో, దుష్టత్వానికి ఒక్క ప్రతినిధి మాత్రమే కన్పించాడు. సర్పము మారువేషంలో ఉన్న సాతాను కావచ్చు (ఆదికాండము 3:1) లేక సాతాను యొక్క ఏజెంట్ అయినా కావచ్చు (ప్రకటన 12:9 చూడు). నేడైతే మనం "ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకారసంబంధులగు లోక నాథులతోను, ఆకాశమండల మందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము" (ఎఫెసీయులకు 6:12). ఈ "దుష్ట సేన" ఎక్కడనుండి వస్తుంది? ఏదో ఒక విధంగా, ఆదాము యొక్క అవిధేయత, లోకంలోనికి పొర్లి వచ్చేలా దుష్ట శక్తులకు "ద్వారం తెరిచిందా"? నాకు తెలియదు, కాని భూమిమీద దుష్టత్వం విస్తరించడానికి ఏదో ఒకటి ప్రేరేపించింది.

"పాపం ద్వారా *మరణం* [లోకంలోనికి ప్రవేశించినట్టు]" 12వ వచనం ప్రత్యేకించి తెలిపింది (నొక్కి చెప్పింది నాది). దేవుడు ఆదాముకు యీలాగున సెలవిచ్చాడు, "అయితే మంచి చెడ్డల తెలివి నిచ్చు వృక్ష ఫలములను తినకూడదు; నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవు" (ఆదికాండము 2:17). ఈ హెచ్చరికయున్నను, అతడును హవ్వయు ఆ వృక్ష ఫలాలను తిన్నారు (ఆదికాండము 3:6). తత్ ఫలితంగా, తోటలోనుండి వారు తోలివేయబడ్డారు, జీవ వృక్ష ఫలాలను ఎన్నడూ తినలేకపోయారు (ఆదికాండము 3:24). అది సంభవించినప్పుడు, వారి దేహాలు క్షీణ దశను చూచాయి; వారు చనిపోసాగారు. మరణమనే శాపం లోకంలోనికి వచ్చింది. చావుకు ముందు వచ్చే బాధ వేదనను గూర్చి ఆలోచించు. సమాధుల వద్ద కార్చబడే కన్నీటిని గూర్చి ఆలోచించు. మరణము "శత్రువని" పౌలు సూచించడంలో ఆశ్చర్యం లేదు (1 కొరింథీయులకు 15:26). ఇదంతా ఆదాము పాపపు ఫలితమే.

మరణ వేదనకంటెను ఎక్కువ తీవ్రమైన మరణాన్ని సాతాను తరములలో జనులను

భయపెట్టడానికిని, బలవంతం చేయడానికిని ఉపయోగించాడు. క్రీస్తు బలియాగమును గూర్చి మాట్లాడుతూ, హెబ్రీ రచయిత యిలా అన్నాడు,

> కాబట్టి ఆ పిల్లలు రక్తమాంసములు గలవారైనందున ఆ ప్రకారమే మరణము యొక్క బలముగలవానిని, అనగా అపవాదిని మరణముద్వారా నశింపజేయుటకును, జీవితకాలమంతయు మరణభయముచేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకును, ఆయనకూడ రక్తమాంసములలో పాలివాడాయెను (హెబ్రీయులకు 2:14, 15).

సంవత్సరాల గుండా, మరణము అపవాది యొక్క "పెద్ద కర్రయైయుంది," తాను ఆజ్ఞాపించిన దానిని ప్రజలు చేయడానికి బలవంతపెట్టే ఆయుధమైయుంది. క్రీస్తు మరణ పునరుత్థానాల ద్వారా సాతాను యొక్క "పెద్ద కర్రను" ప్రభువు వాని యొద్దనుండి లాగివేసికొన్నారు, దేవునికి స్తోత్రం!

ఏదియెలాగున్నా, ఆదాము హవ్వలు పాపముచేసిన దినాన సమస్యలనే పేకేజ్‌పై చుట్టబడిన భౌతిక మరణం చింపివేయబడిందని గ్రహించు. దేవుడు హవ్వతో యిలా అన్నాడు, "నీ ప్రయాసమును నీ గర్భవేదనను నేను మిక్కిలి హెచ్చించెదను; వేదనతో పిల్లలను కందువు" (ఆదికాండము 3:16). ఆయన ఆదాముతో యిలా అన్నాడు,

> నీవు నీ భార్య మాట విని – తినవద్దని నేను నీ కాజ్ఞాపించిన వృక్షఫలములు తింటివి గనుక నీ నిమిత్తము నేల శపింపబడియున్నది; ప్రయాసముతోనే నీవు బ్రదుకు దినములన్నియు దాని పంట తిందువు;
> అది ముండ్ల తుప్పలను గచ్చపొదలను నీకు మొలిపించును;
> పొలములోని పంట తిందువు;
> నీవు నేలకు తిరిగి చేరువరకు,
> నీ ముఖపు చెమట కార్చి ఆహారము తిందువు;
> ఏలయనగా నేలనుండి నీవు తీయబడితివి;
> నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువు ... (ఆదికాండము 3:17–19).

సృష్టి యావత్తు ఆదాము పాపముచేత బాధింపబడింది (రోమా 8:20–22 చూడు). శిశు ప్రసూతియందు ప్రతిసారి స్త్రీ బాధననుభవిస్తున్నప్పుడు ప్రతిసారి వ్యవసాయకుడు మరొక కలుపు మొక్కను చెమట ఓర్చుతూ పెరుకునప్పుడు, ప్రతిసారి ఉద్యోగి పనిలో కష్టమైన పనిని చేసినప్పుడు, ప్రకృతి వైపరీత్యం సంభవించిన ప్రతిసారి, బహు దూరంగా కొనిపోబడిన పాప ఫలితాలకు మనకు ఎక్కువైన రుజువు ఉంది. పాపముచే పీడింపబడిన, పాపముచే పాడుచేయబడిన లోకంలో మనం నివసిస్తున్నాం. ఆదాము దోషము తన సంతతివారికి సంక్రమించిందని బైబిలు బోధించుట లేదు, కాని తన అవిధేయత యొక్క ఫలితాలచే మనం అనుదినం బాధింపబడతాం.

ఈ అంశాన్ని మనం వదలక ముందు, ఆదాము దోషముతో కలుషితమైన ఆత్మలతో శిశువులు జన్మించినట్టు నవ వ్యాఖ్యానకర్తలలో అనేకులు అనడం లేదని నేను గుర్తించాలి. నవీన రుచికి "సంపూర్ణ దుష్టత్వపు వారసత్వం" మింగుడు పడాలంటే, దానిని వారు పలుచన చేశారు. సమస్త వ్యక్తులలో ఆదాము పాపము ఎక్కించబడిందని యిప్పుడు

ఉపదేశించ కోరతారు. "పాపపు లక్షణాలు," "మొగ్గు" లేక "పాపము వైపుకు" వాలు గుణం – ఆదామునుండి మనం "పాప స్వభావాన్ని" పొందామని కొందరంటారు. మనం పాపం చేయక తప్పదని వారు వక్కాణిస్తారు. (మనం పాపం చేయకుండ ఉండలేం), ఎందుకంటే ఈ "పాప స్వభావాన్ని" మనం ఆదామునుండి పొందామని వారంటారు. కొన్ని తర్జుమాలు ఈ థియోలజీని ప్రదర్శిస్తున్నాయి. ఉదాహరణకు, "మాంసము" అనే దానికున్న గ్రీకు పదాన్ని (*sarx*) NIV తరచుగా "పాప స్వభావమని" తర్జుమా చేసింది (రోమా 7:18; 8:4, 5, 8; 13:14). ఆ "పాప స్వభావం" కలిగియుండడంవలననే కొందరు ఎంతో దుర్మార్గంగా మారిపోతారని, పిల్లలు సహితం తమ తండ్రులకు అవిధేయులౌతారని మనం చెప్పబడ్డాం.

"వారసత్వపు దుర్మార్గత" అని సవరించిన ఈ భావంతో నాకు సమస్య ఉంది. మొదటిగా, ముందుగా ప్రస్తావింపబడిన తేటైన లేఖనాల ఉపదేశాన్ని అది యింకను ఉల్లంఘిస్తుంది, అంతేగాక దేవుడు మనలో ప్రతి ఒక్కనికి అనుగ్రహించిన స్వేచ్ఛా చిత్తమును గూర్చిన బైబిలు బోధను కూడా ఉల్లంఘిస్తుందని నేను నమ్ముతున్నాను. రెండవది, ఆదాము తన "పాప స్వభావాన్ని" తన పిల్లలకు ఎలా పంపగలడో నేను చూడలేను. పాపం చేయకముందు తనకు కలిగినదానిని ఆదాము పంపించగలడా? అంటే, తనకు "పాప స్వభావం" ఉన్నందుననే అతడు పాపం చేశాడా? అలాగైతే, అప్పుడు ఆదామును సృజించిన దేవుడే అతనియందు "పాప స్వభావాన్ని" ఉంచాడనే గదా! ఆదాము పాపానికి దేవుడే బాధ్యుడైయుండాలనేది దీని అర్థం. తప్పక ఈ తీర్మానాన్ని మనం అంగీకరించలేం.

పాపము చేయక ముందు ఆదాముకు "పాప స్వభావం" లేకుంటే, తన స్వేచ్ఛా చిత్తాన్ని ఉపయోగించుకున్న దాని ఫలితంగా తనకు "పాప స్వభావం" వచ్చియుండాలి. అంటే, తన "పాప స్వభావం" సంపాదించుకున్న లక్షణమే. "వారసత్వపు దుర్మార్గత" అని సవరించిన సిద్ధాంతం ప్రకారం, ఆదాము తాను సంపాదించుకున్న గుణాన్ని యింకొకరికి పంపడం – హేతు విరుద్ధమైనదియు అనంగీకారమైనదియునైన తీర్మానమై యుంది. ఆకస్మిక సంభవంలో నేను చేతిని పోగొట్టుకొంటే, (సంపాదించుకున్న లక్షణం) నా పిల్లలు చేయి లేకుండ పుడతారనేది అర్థం కానేరదు.

"పాప స్వభావంతో" సృజింపబడినందున ఆదాము పాపం చేయలేదు సరిగదా "పాప స్వభావంతో" మనం జన్మించినందున మనం పాపం చేయలేదు. అయితే, మనం పాపం ఎందుకు చేశాము? మానవ ప్రవర్తన యొక్క మర్మమంతా గ్రహించినట్టు చెప్పుకోకుండ, ఆదామును గూర్చియు మనలను గూర్చినవైన బైబిలు సత్యాలను కొన్నింటిని రివ్యూ చేస్తాను:

- దేవునిచే ఆదాము ఆత్మ పవిత్రంగాను, పరిశుద్ధంగాను సృజింపబడింది. ఆలాగే, మన ఆత్మలు కూడా పవిత్రమైనవి, పరిశుద్ధమైనవి. ఎందుకంటె అవి దేవుని యొద్దనుండి వచ్చాయి (జెకర్యా 12:1; ప్రసంగి 12:7లను చూడు).
- ఆదాము స్వేచ్ఛా చిత్తంతో చేయబడ్డాడు అతడు లోబడవచ్చు, లోబడకపోవచ్చు. ఆలాగే మనం కూడా లోబడవచ్చు, లోబడకపోవచ్చు దేవుడు ప్రసాదించిన

ఆలాటి సామర్థ్యం మనకుంది (ద్వితీయోపదేశకాండము 30:15-20 చూడు).

- ఆదాము దేవుని స్వరూపంలో చేయబడిన జీవించు ప్రాణి, అయితే అతనికి రక్తమాంసాలతో కూడిన శరీరముంది. శోధకుడు ఆదాము హవ్వలను సంధించిన తీరు వారి శరీర సంబంధమైన ఆశల ద్వారా (ఆదికాండము 3:6). లెక్క చెప్పవలసిన ప్రతి వ్యక్తియు శరీరాత్మల మధ్య ఒత్తిడికి గురియౌతాడు (మత్తయి 26:41; 1 యోహాను 2:16; రోమా 7:18, 19లను చూడు).
- ఏదెను తోటలో సహితం శోధన ఉంది (Even in Paradise), పాపభరితమైన ఈ లోకంలో, మనం మానక శోధనలచేత తాకబడతాం (హెబ్రీయులకు 2:18; 4:15 చూడు).
- కోరుకునే స్వాతంత్ర్యం గలవాడు ఎల్లవేళల సరియైనవాటినే కోరుకోడు. ఒకడు శోధింపబడి తప్పుడుదాన్ని కోరుకున్నప్పుడు, అది పాపం. ఆదాము తప్పుదాన్ని కోరుకున్నాడు - మనమూ ఆలాగే చేశాం (రోమా 3:23).
- స్వేచ్ఛా చిత్తపు కార్యంగా ఆదాము దేవునికి అవిధేయుడయ్యాడు. అతడు పాపం చేసినందున దోషియని తీర్పునొందాడు. ఆలాగే, స్వతంత్ర్యం గల వ్యక్తులుగా పాపం చేస్తాం, దానికి మనం బాధ్యులమైయుంటాం, యితరుల పాపాలకు కాదు.

ఆత్మ సంబంధంగా, ఆదామువలె అదే ప్రాథమిక పాయింటునుండి మనలో ప్రతి ఒక్కరం జీవితాన్ని ఆరంభిస్తాం. అతడు నరుడైయున్నాడు, మనము కూడా నరులమే. అతడు పొరపాటుపడదగిన స్థితిలో ఉన్నాడు, మనము పొరపాటుపడదగిన స్థితిలోనే ఉన్నాం. తాను చేసినట్టే, నేడో రేపో మనం కూడా అదే ప్రాథమిక పొరపాటు చేసేవారమై యున్నాం: మనం దేవునికి అవిధేయులమయ్యాం. మనం అలా చేసినప్పుడు, మనం చేసినదానికి బాధ్యులమైయున్నాం, ఆదాము చేసినదానికి కాదు. Deason దాన్ని యిలా అన్నాడు: "పాప సమాజాలవలన పాపులు చేయబడ్డారు కాని పాపపు బీజమువలన కాదు! జనులు పాపులుగా కోరిక చొప్పున, ఆచరణ చొప్పున అయ్యారు."[17] ఆదాము పాప దోషాన్ని మనం స్వతంత్రించుకొన్నట్టు బైబిలు బోధించలేదని నేను మరొకసారి స్థాపిస్తున్నాను.

**సార్వత్రిక రక్షణను అది బోధించుట లేదు**

ప్రతి ఒక్కరు రక్షింపబడుదురని రుజువు చేయడానికి మూల వాక్యంగా కూడ రోమా 5:12-21 ఉపయోగింపబడింది. వీరి స్థితిని కొన్నిసార్లు "డాక్ట్రిన్ ఆఫ్ యూనివర్సలిజం" అని పిలుస్తారు.

వాదం 18వ వచనం మీద కేంద్రీకరించబడింది: "కాబట్టి తీర్పు ఒక్క అపరాధ మూలమున వచ్చినదై మనుష్యుల కందరికిని శిక్షావిధి కలుగుటకు ఏలాగు కారణ మాయెనో, [ఏదెనులో ఆదాము పాపము] ఆలాగే ఒక్క పుణ్య కార్యమువలన కృపాదానము [సిలువపై క్రీస్తు మరణము] మనుష్యులకందరికిని జీవప్రదమైన నీతి విధింపబడుటకు

కారణమాయెను." నమ్మకమేమంటే, ఆదాము పాపము అందరిని దోషులుగా ఎంచింది, క్రీస్తు మరణము ఆదాము పాపము యొక్క ప్రభావాన్ని తిప్పికొట్టినందున ప్రతి ఒక్కరు రక్షింపబడతారు. మరల, కీలక సిద్ధాంతము యొక్క స్థితి స్పష్టంగా లేని లేఖన భాగం మీద ఆధారం చేసికొన్నదానికి యిది ఒక ఉదాహరణయైయుంది. లేఖనాలను వ్యాఖ్యానించి వర్తింపజేయడంలో యిది పెద్ద తప్పు.

ప్రతి ఒక్కరు రక్షింపబడేది లేదని బైబిలు స్పష్టంగా బోధిస్తుంది. అనేక లేఖనాలను చెప్పవచ్చు (మత్తయి 25:34, 41, 46 చూడు), రోమా పత్రికలో పౌలు యొక్క సొంత ప్రతిపాదనలను దాటి మనం చూడనక్కరలేదు. అధ్యాయం 2లో, "దేవుని న్యాయమైన తీర్పు బయలుపరచబడు దినమందు" (నీకు నీవే ఉగ్రతను సమకూర్చుకొనుచున్నావు) (5 వచనం). "సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడువారిమీదికి దేవుని ఉగ్రతయు రౌద్రమును వచ్చును" (8 వచనం). 12వ అధ్యాయంలో "దేవుని ఉగ్రతను" గూర్చి పౌలు తిరిగి మాట్లాడి " 'పగతీర్చుట నా పని, నేనే ప్రతిఫలము నిత్తును' అని **ప్రభువు** చెప్పుచున్నాడు" అని పాత నిబంధననుండి కోట్ చేశాడు (19 వచనం).

"అనేకులు," "అందరు" అనే మాటలను మూల వాక్యంలోనుండి కొందరు పట్టుకున్నారు. సార్వత్రికమైన రక్షణ లేకపోయినా, నశించేవారికంటే బహు ఎక్కువ మంది రక్షింపబడతారని యిది బోధించుతున్నట్టు వారు తీర్మానించారు. అలా ఉండాలని మనమందరం కోరుకుందాం – కాని రక్షింపబడేవారికంటే నశించిపోయేవారే ఎక్కువ ఉంటారనే ప్రభువైన యేసువారి బోధను మనమంగీకరించాలి (మత్తయి 7:13, 14).

5:18 యొక్క భావాన్ని మనం తరువాత పాఠంలో చర్చించుదాం. ప్రస్తుతానికి, కేవలం ఈ మాటలను చెప్పనిమ్ము: చిట్ట చివరికి ప్రతి ఒక్కరు రక్షింపబడతారని ఈ వచనం ఉపదేశించడం లేదు.

## ఈ లేఖన భాగం బోధించేది ఏమి?

### ఒక ప్రశ్న ఆలోచించబడింది

5:12–21 ఏమి ఉపదేశించడం లేదో నొక్కి చెప్పాను. అయితే అది ఏమి బోధిస్తుందో అది యింకను తీర్మానించవలసియుంది. ఈ వ్యాఖ్యానాన్ని బహుగా ప్రభావితం చేసేది 12వ వచనంలోని "మరణం" శరీర సంబంధమైనదా, ఆత్మ సంబంధమైనదా, లేక రెండింటికి సంబంధించిన ఏదో సమ్మేళనమైయున్నదా? ఈ ప్రశ్నకు అంత తేలికైన జవాబు ఏదీ లేదు.

12వ వచనం యిలా అంటుంది: "ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున *మరణము* అందరికి సంప్రాప్తమాయెను" (నొక్కి చెప్పింది నాది). ఈ సందర్భంలో "మరణము" అనేది నిస్సందేహంగా, శరీర మరణమేయని రీజనింగ్ చేసేవారిని నేను పఠించాను. ఆ స్థితిలోని కొన్ని బలాలను ఆలోచిద్దాం.

(1) ఆదికాండం 2, 3ల్లో "నీవు నిశ్చయముగా చచ్చెదవు" అనే ఆదాము యొక్క

పాప కథమీద 12వ వచనంలోని తొలి భాగం ఆధారపడియుంది (2:17; 3:3లను చూడు). పాపపు ప్రభావం మీద (4000) నాల్గువేలకంటే ఎక్కువ సంవత్సరాలు బైబిలు బోధను పొందే అవకాశం నీకు నాకు ఉంది. గనుక ఆదాము పాపము భౌతిక, ఆత్మ సంబంధమైన మరణములుగా పరిణమించినట్టు మనకు అర్థమౌతుంది. ఏదియేలాగున్నా, అది భౌతిక మరణమేయన్నట్టు ఆదాము అర్థం చేసికొనియుంటాడు. నిషేధింపబడిన పండ్లను అతడు తిన్నందున, జీవ వృక్షములో అతడు ఏ మాత్రమును పాలుపొందలేక పోయాడు (2:9; 3:24). మన శరీరమువలె అతని దేహం క్షీణింపసాగింది.[18]

(2) ఆదాము/క్రీస్తు పోలికను పౌలు తన ముందు పత్రికలో ఉపయోగించాడు (1 కొరింథీయులకు 15:21, 22, 45–49). 1 కొరింథీయులకు 15:22 తలంపును అతడు రోమా 5:12–21లో ప్రతిధ్వనింపజేస్తున్నాడు: "ఆదామునందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు." 1 కొరింథీయులకు 15లో ప్రధానాంశం శరీర పునరుత్థానం. రోమా 5లోని మూల వాక్యమందు దేహం మీద పాపము యొక్క ప్రభావము ప్రధాన యోచనగా ఉన్నట్టు భావించడం హేతుబద్ధమైనదే.

(3) ఒక మనుష్యుని పాపము మానవ జాతినంతటిని బాధించినట్టు లేఖన భాగము తేటగా బోధిస్తుంది. మనం కాల్వినిష్టు తీర్మానాలను లెక్కలో వేసికొంటే, మానవ జాతి యావత్తును, పాపము చేయని శిశువులను సహితం ఆదాము పాపము ఎలా బాధిస్తుంది? తన పాప ఫలితంగా మనమందరం *భౌతికంగా* మరణిస్తాం.

ఈ లేఖన భాగంలోని "మరణం" *ఆత్మ సంబంధ*మైన మరణాన్ని నిస్సందేహంగా సూచిస్తుందని చెప్పినవారి రీజనింగ్‌ను కూడ నేను ఆలోచించాను. ఈ వ్యాఖ్యానంలో రెండు బలమైన పాయింట్లున్నాయి:

(1) ఈ లేఖన భాగము "ఇట్లుండగా" అనే మాటతో ఆరంభమౌతుంది. గతంలో పౌలు ఏమి చెప్పాడో దానితో యిది ముడివేయబడుతుంది. ముందు జరిగిన సందర్భంలో శరీర సంబంధమైన అక్కరలకంటె, ఆత్మ సంబంధమైన అక్కరలు శ్రేష్ఠంగా తగినవై యుంటాయి.

(2) "అందరు పాపము చేసి" (12 వచనం) అనేది 3:23లో వంటిదే, ఈ పొజిషన్ దీనికి అనుమతిస్తుంది "నీతిమంతులుగా తీర్చబడడం" వంటి మాటలు కూడా (18 వచనం) గత నాల్గున్నర అధ్యాయాల్లోవలెనే ఉపయోగించబడ్డాయి. (రోమా పత్రికలో, కొన్ని కీలకమైన మాటలు – ఆయా సందర్భాలలో ఆయా అర్థాలిచ్చేటట్టు పౌలు ఉపయోగించాడు; కాని, రూలు ప్రకారం – బహు సామాన్యమైన భావం ఏరుకోవాలి.)

చివరిగా, భౌతికమైన ఆత్మ సంబంధమైన మరణాల మధ్య కోరుకొనడం తప్పని వక్కాణించేవారి రచనలు కూడ నేను చదివాను. ఆదాము పాపము యొక్క ప్రతి శిక్షయు, ఫలితాలు ఏదైనా ప్రతిదీ పౌలు మనస్సులో ఉందంటారు.[19] James D. G. Dunn యిలా రాశాడు, "యూదుల ఆలోచన యొక్క విలాసంగా కొట్టుకొనిపోయే ఆలోచనలో 'శరీర,' 'ఆత్మ సంబంధమైన' మరణాల మధ్య తేడా ఉన్నట్టు ఏ సూచనా లేదు … సృష్టికర్తనుండి సృష్టిగా యావత్తు ఒకే విధంగా దూరమయ్యింది."[20] "రెండు లేఖన

భాగాలను [17, 21 వచనాలు] అర్థం చేసికొనే శ్రేష్ఠమైన విధానం రెండు రకాలైన మరణానికి రెఫరెన్సు అయ్యుండవచ్చు. భౌతికమైన మరణం మనస్సులో ఉంది, భౌతిక మరణం మాత్రమే కాదు; భౌతిక మరణము ఆత్మ సంబంధమైన మరణానికి గురుతుగాను, సూచనగాను ఉంది"[21] అని Morris అన్నాడు.

పత్రిక రోముకు పంపబడినప్పుడు, అసలు దాన్ని పొందినవారికి చదివి వినిపింపబడి యుంటుంది[22] అని Rogers సూచించాడు. 5:12-21 పెద్దగా కొద్ది నిమిషాల్లో చదువబడగలదై ఉన్నందున, శ్రోతలు గుర్తుంచుకో గలిగినదంతా ప్రాథమికంగా ఆ సందేశం యొక్క తాకిడి మాత్రమే: మానవజాతిలోనికి ఆదాము ప్రవేశపెట్టిన ఏ సమస్య అయినా – యింకను ఎక్కువగా క్రీస్తువారు చక్కపరచారనునదియే. Edwards ఆలాటి పాయింటునే చెప్పాడు.[23] "పటమంతటిలోనున్న" రూపం యొక్క బలాన్ని అతడు గుర్తించాడు, వివరాలతో కాదు. మాదిరి/దృష్టాంతములనే పోలిక అనే పాయింటును వివరాల్లోనికి వెళ్లితే పోగొట్టుకొనడం ఔతుందని అభిప్రాయపడ్డాడు.

12వ వచనంలోని "మరణానికి" సంబంధించి ఈ స్థితులన్నిటిచే నేను యింప్రెస్ అయ్యాను. ఇతర చోట్ల ఉన్న లేఖన భాగాలలోని తేటైన సందేశాన్ని ఉల్లంఘించినంత మట్టుకు, వాటిలో ఏదియు తప్పని నిశ్చయంగా నేను చెప్పలేను. ప్రతి విధానంలోను బలాలు, బలహీనతలు కన్పిస్తాయి. ఏ స్థితిని ఒకడు తీసికొన్నప్పటికిని, అదిగమించవలసిన కష్టాలున్నాయి.

**మూల వాక్యం పరిశీలించబడింది**

తన పాయింటు నేరుగానే ఉన్నట్టు పౌలు తలంచియుండవచ్చు: ఆదామునందు మనం ఏమి పోగొట్టుకున్నామో క్రీస్తునందు ఎక్కువగానే పొందాం. అది ఒక ప్రాముఖ్యమైన ఆలోచన, గంభీరమైన ఆలోచన కూడా. యింకను నేరైనదైయుంది. తన మాటలు పొందిన సూక్ష్మమైన పరిశీలనను బట్టి అతడు ఆశ్చర్యపోయి ఉంటాడంటే సందేహం అక్కరలేదు. అయినప్పటికిని, మూల వాక్యాన్ని మనం పరిశీలించ బద్ధులమైయున్నాం. దీన్ని మనం తరువాత పాఠంలో ఆరంభిస్తాం. ప్రతి వచనంలోను పౌలు ఏమి చెప్పాడో అనేదానికి సంబంధించి నీ సొంత నిర్ణయం చేసికొనేంత సమాచారాన్ని యివ్వ ప్రయత్నిస్తాను.

## ముగింపు

ఆదాము పాప ఫలితాలను ఒక క్లాసు చర్చించడానికి ప్రయత్నించినప్పుడు, ఈ ప్రశ్న తరచుగా అడుగబడుతుంది: "ఆదాము పాపము చేయకుంటే ఎలా ఉండేదో?" అతడు పాపం చేయకుండినట్టయితే, ఆదాముకు ఏమి జరిగియుండేదో అనేది ప్రశ్నలో ఒక విషయమైయుంది. ఆ దృశ్యం శతాబ్దాలలో గుండా తర్కించబడుతునే వస్తుంది. హనోకు, ఏలీయాలవలెనే మరణము చూడకుండ ఆదాము పరదైశుకు పంపివేయబడి యుండేవాడేయని ప్రజాభిమానపు దృష్టియైయుంది. ఏదియెలాగున్నా, ప్రశ్నకున్న మరియొక ముఖమునందు ఎక్కువమంది ప్రజలకు అభిలాష ఉంది: "ఆదాము పాపము చేయకుండినట్టయితే లోకము ప్రస్తుతపు స్థితిలో ఉండియుండేదా?" సాధారణంగా

"అయ్యుంటే" అనే ప్రశ్నలలో దీనికి బదులు చెప్పడం అసాధ్యం ఎందుకంటే, ఆదాము పాపం చేశాడు గనుక. ఆదాము పాపము చేయకుండ ఉండి, లోకాన్ని యిలా పాడు చేయకుండా ఉండియుంటే … అతని పిల్లలు, పిల్లల పిల్లలు పాపం చేయకుండ ఉండినా, … అది చివరికి నా వద్దకు వచ్చి చేరుకున్నప్పుడు, నేనైనా పాపం చేసియుండేవాడనే – అప్పుడు, చివరికి ఫలితం అదే అయ్యుంటుందని నేను ఎల్లప్పుడు ఊహిస్తుంటాను.

"లోకానికి అన్ని రకాలైన బాధలు, కష్టాలు కొని తేడానికి నీకు సిగ్గులేదా?" అని నా వ్రేలిని ఆదామువైపు చూపడం ఈ పాఠం యొక్క ఉద్దేశం కాదు. మనమందరము ఆదాము అడుగుజాడలను అనుసరించామనేది వాస్తవం. మనమందరం పాపం చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోయాం (3:23). భౌతిక మరణంకంటెను ఎంతో చెడ్డదైన ఫలితం ఉంది: మనం ఆత్మ సంబంధంగా చనిపోతాం (6:23), "రెండవ మరణం అంటే అగ్ని గుండంలో" మన ఆత్మలు పడవేయబడే అపాయంలో మనం నిలిచియుంటాం (ప్రకటన 20:14). 5:12–21 యొక్క మన స్టడీ కొనసాగుతుండగా, మనకున్న ఒకే నిరీక్షణ ప్రభువైన యేసు మాత్రమేనని మరోసారి స్థాపించబడుతుంది. "ఒక మనుష్యుడు [ఆదాము] ద్వారా పాపము లోకములో ప్రవేశించింది" (12 వచనం), కాని మరొక మనిషి (యేసు) ద్వారా కృప ఈ లోకములోనికి వచ్చి చేరుకుంది. నీవు ఆదాము మాదిరి వెంటాడ జూడవచ్చు, లేక నేడు నీవు యేసు మాదిరిని వెంటాడవచ్చు. నీవు దేన్ని కోరుకుంటావు?

## సువార్తికులకు, ఉపదేశకులకు నోట్సు

ఈ ప్రసంగాన్ని నీవు ఉపయోగించినప్పుడు యేసును వెంబడించడానికి వారు ఎలా కోరుకోవాలో నీ శ్రోతలకు చెప్పు – వారు సువార్తను నమ్మి (1:16), తమ పాపముల విషయంలో మారుమనస్సు పొంది (2:4), యేసు దేవుని కుమారుడని ఒప్పుకొని (10:9, 10), పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది (6:3–6), క్రైస్తవ జీవితం జీవించాలి (12:1).

ఈ పాఠం మూడు భాగాల్లో ఒకటైయుంది. ఈ మూడింటిలోను ముఖ్యాంశాలను తీసికొని "ఇద్దరు 'ఆదాములు' " అనే ఏక పాఠం చేయవచ్చు. ఈ పాఠంలోని సందేశాన్ని పరిచయంగా వాడవచ్చు. నీ మూడు పాయింట్లు: "ఇద్దరు 'ఆదాములు' పరిచయం చేయబడ్డారు," "ఇద్దరు 'ఆదాముల' తారతమ్యం," "ఇద్దరు 'ఆదాములు' పోల్చబడ్డారు." ("విదితమైన సత్యాలు") మూడవ పాఠంలోని వర్తింపు నీ ముగింపు కావచ్చు.

5:12–21ని ఒకే పాఠంలో పెట్టడానికి అనేక మార్గాలున్నాయి. "ఇద్దరు మనుష్యుల కథ" అని Charles Swindoll - Charles Dickens యొక్క *A Tale of Two Cities*నుండి ఉదాహరణలను తీసికొని వచ్చాడు.[24] ఈ భాగానికి "Ruin and Rescue" అని William Barclay పేరు పెట్టాడు. మనం "పాపంవలన సర్వ నాశనమైన," "క్రీస్తుచేత తప్పించబడ్డామని" అతడు నొక్కి చెప్పాడు.[25] "Paradise Lost - and Regained" అనే John Milton రచనలనుండి కొందరు రచయితలు అప్పు తెచ్చుకున్నారు. "ఏలు"

మరియు “ఏలిన” అనే పదాలు పలుమార్లు మన మూల వాక్యమందు ఉపయోగించబడినందున (14, 17, 21 వచనాలు), D. Stuart Briscoe తన కామెంట్సును “నలుగురు ఏలికలు” (“The Four Monarchs”) అనే పేరు పెట్టాడు.[26] నీ రిమార్క్సును “మరి ఎక్కువగా” అనేవాటి మీద కేంద్రీకరించవచ్చు (15, 17 వచనాలు; 20 వచనం చూడు).[27]

## సూచనలు

[1]Adapted from J. D. Thomas, *Romans,* The Living Word series (Austin, Tex.: Sweet Publishing Co., 1965), 40. [2]Moses E. Lard, *Commentary on Paul's Letter to Romans* (Lexington, Ky.: N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 162. [3]Richard Rogers, *Paid in Full: A Commentary on Romans* (Lubbock, Tex.: Sunset Institute Press, 2002), 83. [4]Douglas J. Moo, *Romans,* The NIV Application Commentary (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 2000), 181. [5]John R. W. Stott, *The Message of Romans: God's Good News for the World,* The Bible Speaks Today series (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1994), 149. [6]R. St. John Parry, *The Epistle of Paul the Apostle to the Romans* (Cambridge: University Press, 1921), 84. [7]Jim McGuiggan, *The Book of Romans,* Looking Into The Bible Series (Lubbock, Tex.: Montex Publishing Co., 1982), 178. [8]Larry Deason, *"The Righteousness of God": An In-depth Study of Romans,* rev. (Clifton Park, N.Y.: Life Communications, 1989), 142. [9]Ibid., 156. [10]Quoted in Morris, 231.

[11]కథోలిక్ సిద్ధాంతం ప్రకారం, “Limbo” అనేది – సిలువపై క్రీస్తువారి బలికి ముందు మృతినొందిన నీతిమంతులకొరకైన స్థలం కూడా. (Charles G. Herbermann, et. al., eds., “Limbo,” in *The Catholic Encyclopedia* [New York: Encyclopedia Press, 1913], 9:256-59.) [12]కీర్తన 58:3 వంటి లేఖన భాగాలతో పోల్చి చూడు. భక్తిహీనులు పుట్టినతోడనే అబద్ధములాడుచు తప్పిపోవుదురు. అక్షరార్థంగా తీసికొంటే యిది అసాధ్యం. [13]James R. Edwards, *Romans*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1992), 147. [14]Moo, 189. [15]Edwards, 148. [16]Morris, 231. [17]Deason, 151. [18]ఆదాము పాపము చేయకముందు భౌతిక మరణమే లేదని కొందరు నమ్ముతారు. జంతువులు నరులు వృక్షములే – ఆహారంగా యివ్వబడ్డారు (ఆదికాండము 1:29, 30). ఆదాము పాపము చేసిన మీదటనే తొలి భౌతిక మరణం సంభవించిందని, ఆదాము హవ్వలకు వస్త్రాలివ్వడానికి జంతువులు చంపబడ్డాయని (ఆదికాండము 3:21) కొందరు అన్నారు. [19]రోమా 1:32లో ఉపయోగించబడినట్టు “మరణము” అనే పదం మీద కామెంట్స్ చూడు (“పౌలు యొక్క ‘లోకపు పరిస్థితి’ సందేశం” *రోమా పుస్తకం, 1*లో కన్పిస్తుంది చూడు). [20]James D. G. Dunn, *Romans 1-8,* Word Biblical Commentary, vol. 38 (Dallas: Word Books, 1988), 273.

[21]Morris, 230. [22]Rogers, 84. [23]Edwards, 146. [24]Charles R. Swindoll, *Coming to Terms with Sin: A Study of Romans 1-5* (Anaheim, Calif.: Insight for Living, 1999), 87-88. Swindoll ఆ యిద్దరు మనుష్యులను “దోషియైన మనుష్యుడు,” “కృపపొందిన మనుష్యుడు” అని పిలిచాడు. [25]William Barclay, *The Letter to the Romans,* rev. ed., The Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1975), 77, 82. [26]D. Stuart Briscoe, *Mastering the New Testament: Romans,* The Communicator's Commentary Series (Dallas: Word Publishing, 1982), 119. [27]James Burton Coffman, *Commentary on Romans* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1973), 208. నీ పరిచయంలో, “మరి ఎక్కువగా” అనేవి గత పాఠంనుండి నీవు గమనించవచ్చు (5:9, 10).